క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు



ఎల్కతుర్తి: మండలంలోని కోతులనడుమ గ్రామంలో వైభవోపేతంగా నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు బుధవారం కొనసాగాయి. ఉదయం పంటప స్థాపిత దేవత పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని భూలక్ష్మి, మహాలక్ష్మి గ్రామ శిల బొడ్రాయి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొయినపల్లి రజిత, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి రమా, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నాగుర్ల'ను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు



ఆత్మకూరు: మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు బుధవారం మాజీ కోఆప్షన్ మెంబర్ బాబుమియా ఆధ్వర్యంలో రైతు రుణవిమోచన కమిటీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావును హనుమకొండలోని ఆయన నివాసంలో కలిశారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

చైల్డ్‌లైన్-1098 సేవలపై అవగాహన



పరకాల: 18 సంవత్సరాలలోపు బాలబాలికల కోసం చైల్డ్‌లైన్-1098సేవలు 24 గంటల పాటు అందిస్తుందని ఆ సంస్థ హనుమకొండ జిల్లా సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ తెలిపారు. పరకాల బస్‌స్టేషన్‌లో చైల్డ్‌లైన్-1098 ఆధ్వర్యంలో ప్రయాణికులకు బాలల సేవలు, రక్షణ చర్యలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అనాథ బాలలు, తప్పిపోయిన, పారిపోయిన వచ్చిన బాలలు, అక్రయ రవాణాకు గురయ్యే 18 సంవత్సరాలలోపు బాలబాలికల కోసం, బాల కార్మికుల సమాచారం, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులతో పాటు భౌతిక హింసకు గురైన బాలల రక్షణ కోసం 24 గంటల పాటు చైల్డ్‌లైన్-1098సేవలు అందిస్తుందని తెలిపారు.

న్యాయవాదులంతా ఐక్యతగా కృషిచేయాలి



పరకాల: పరకాల సబ్‌కోర్టు కోసం న్యాయవాదులంతా ఐక్యతగా పోరాడాలని తెలంగాణ బార్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సిరికొండ సంజీవరావు పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని బుధవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరకాల కోర్టు అభివృద్ధికి, న్యాయవాదుల సమస్యలకు బార్ అసోసియేషన్ పరకాల అధ్యక్షుడు వి.చంద్రమౌళి ఆధ్వర్యంలో కొత్త కమిటీ కృషిచేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేకల శ్రావణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, మేరుగు శ్రీనివాస్, గంద్ర నరేష్‌రెడ్డి, మహిళ న్యాయవాది వెంకటరమణ, పరమేశ్వర్, శంకర్, రాఘవేంద్ర శర్మ, వేణు, రవికుమార్, సురేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

ఎల్కతుర్తి: ఈనెల 5న హుస్నాబాద్ డిపో గ్రౌండ్‌లో నిర్వహించే మంత్రి కేటీఆర్ మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చేపట్టే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మండలం నుంచి సమారుగా 10వేల మందిని తరలించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలపై మంత్రి కేటీఆర్ ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ వంగ రవీందర్, నాయకులు మాడుగుల రవీందర్, దార్న శ్రీనివాస్, శనిగరం సదానందం, బొల్లంపెల్లి రమేష్, మాడుగుల అశోక్ పాల్గొన్నారు.

ఆలయాలకు పూర్వ వైభవం

● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

ఐనవోలు: రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం కేసీఆర్ ద్వారానే సాధ్యమైందని, గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని రాంనగర్‌లో బుధవారం శివపంచాయతన శ్రీ అంజనేయస్వామి, నవగ్రహ దేవతా సహిత ధ్వజ శిఖర, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను కోలాటాలు, నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ పురాతన దేవాలయాలను సైతం పూర్వ వైభవం తెచ్చి ఆధ్యాత్మికతను పెంపొందించారన్నారు. దీంతో ఆలయాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడంతో తన జన్మ సుకృతం అయిందన్నారు. గత ప్రభుత్వాలు ఆలయాలను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణలో ఎక్కడ చూసినా ఆలయాలు దర్శనమిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతను పెంపొందించడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలు ఆధ్యాత్మికతతో ఉన్నప్పుడు గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటుఉండదని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ప్రముఖ న్యాయవాది తక్కళ్లపెల్లి శ్యాంసుందర్‌రావు, సర్పంచ్ బోయినపెల్లి శ్రీనివాసరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిజ్ఞాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పరకాల: రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో బుధవారం రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలు నిర్వహించారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశ్వతేజ, శివ, రవళి, తిరుపతి, సునీల్, మధు రాజనీతి శాస్త్ర విభాగం నుంచి తెలంగాణ ఉద్యమంలో పరకాల పాత్రపై ప్రాజెక్టు విశేషాలను ప్రదర్శించారు. అదే విధంగా ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో తెలంగాణ పూలపండుగ బతుకమ్మపై విద్యార్థినులు శశిశ్రీ, అపర్ణ, వాసవి, సింధు, అంజలి ప్రదర్శనలు చేపట్టి పలువురిని ఆకట్టుకున్నారు. రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నిర్వాహకుల నుంచి ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను, జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, ఎం.రవికుమార్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణలను పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పరామర్శ

ఎల్కతుర్తి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ గాజుల ఐలయ్య కుటుంబ సభ్యులను బీజేపీ నాయకుడు బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, మధుకర్‌గౌడ్, జనగాని కిష్టయ్య, బిట్ల లింగయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వం కొంటుంది

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజయ్య

ధర్మసాగర్(వేలేరు): వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. వేలేరు మండలం చింతల్‌తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన దేశం బాగుపడదని అన్నారు. రైతులు మధ్య దళారుల చేతిలో మోసపోవద్దని, విత్తనం నుంచి విక్రయం వరకు అంతా రాష్ట్ర ప్రభుత్వమే చూసుకుంటుందని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం కూడా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. అదే విధంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న పంటలను సర్వేచేసి నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే రైతులకు ధైర్యం చెప్పారు. ధాన్యం తడిసినా కూడా కొనుగోలు చేయాలని మిల్లరను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాలోతు రాంచందర్, నారాయణగిరి సర్పంచ్ కర్ర సోమిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



దామెరలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఈడీఈ, విద్యుత్ అధికారులు



ధర్మసాగర్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఈ కుమారస్వామి, తదితరులు

దామెర: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పరకాల ఏడీఈ దేవేందర్ అన్నారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఆదా చేసి భవిష్యత్ తరాలకు సంపదగా ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ బావుల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకొని సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రైతులను కోరారు. వర్షాలు కురిసిన సమయాల్లో విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ మీటర్లు అమర్చుకొని 101 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ గుర్రం రమేష్, సబ్ ఇంజనీర్ సీహెచ్. చందన లైన్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్లు మనోహర్, రవీందర్, సురేష్, జేఎల్ఎంలు కృష్ణ, రమేష్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై జాగ్రత్తలు పాటించాలి

ధర్మసాగర్: విద్యుత్ వినియోగంపై వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఏఈ కుమారస్వామి అన్నారు. మండలంలోని నారాయణగిరి సబ్‌స్టేషన్‌లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యుత్ చాలా విలువైనదని, పొదుపుగా వినియోగించుకుందామని సూచించారు. నేటి విద్యుత్ ఆదా రేపటి విద్యుత్ మిగులు అనే నినాదంతో అందరూ విద్యుత్ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ప్రమాదాలు నివారణకు జాగ్రత్తలు పాటించాలన్నారు.

మరో 20 ఏళ్లు బీఆర్ఎస్‌దే అధికారం

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు: తెలంగాణ రాష్ట్రంలో మరో 20 ఏళ్లు బీఆర్ఎస్‌దే అధికారం అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో రూ.3.70కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ధర్మారెడ్డి బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. ఆత్మకూరు గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పెద్ద చెరువు నుంచి బ్రాహ్మణపల్లి చెరువుకు నీటిని విడుదల చేశామని ఇది రైతులకు ఉపయోగకరమన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలతరజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, వైస్ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, నత్తి సుధాకర్, బాషబోయిన సాగర్, బయ్య రాజు, కోఆప్షన్ మెంబర్ అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీరాములు

ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని హనుమకొండ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని కక్కిరాలపెల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ఎందరో పేదలు కళ్ల జబ్బులతో బాధ పడుతున్నారని, మనిషికి కళ్లు ఎంతో ముఖ్యమని దీనిని దృష్టిలోకి తీసుకున్న సీఎం కేసీఆర్ కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అర్హత కలిగిన వారందరు కంటివెలుగు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీమత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న వేద పండితులు, భక్తులు

శాయంపేట: మండల కేంద్రంలోని కాకతీయల కాలంలో నిర్మించిన శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు యాగ్నికలు రంగనాథ చార్యులు, వేద మంత్రోత్సవాల నడుమ అంకురార్పణ, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన్, హోమం, ధ్వజారోహణం, గరుడ ముద్ద కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామపెద్దలు జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న జన్ను దినేష్‌మాదిగ

హన్మకొండ: అవినీతి ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జన్ను దినేష్‌మాదిగ మాట్లాడుతూ అవినీతి లేని స్వచ్ఛమైన పాలన అందిస్తామని చెప్పి బీఆర్ఎస్ పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బంధు పథకంలో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఎమ్మెల్యేలు తీసుకున్నారని స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పడం అవినీతి జరుగుతోందనడానికి నిదర్శనమని తూర్పారబట్టారు.

మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న బంక సరళ

హన్మకొండ: వరంగల్ మహానగర అభివృద్ధిని విస్మరించిన రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని కాంగ్రెస్ మహిళా విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళయాదవ్ హెచ్చరించారు. హనుమకొండ గోకుల్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నగరంలో పర్యటించినప్పుడు హంగు అర్భాటాలు చేయడం తప్ప అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. పైలట్ ప్రాజెక్టు కింద 2016లో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలి నుంచి ఎన్జీవోస్ కాలనీ, వడ్డెపల్లి చర్చి కూడలి వరకు రోడ్డు అభివృద్ధి చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. గుల్ల చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధే ఇప్పటికీ కనిపిస్తోందని వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ మహిళా విభాగం హనుమకొండ బ్లాక్ అధ్యక్షురాలు సుజాత, కమల, బొల్లు శ్యామల, పోశాల సుజాత గౌడ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాఫ్



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: కులమతాలకు అతీతంగా ముస్లింలు జరుపుకునే ఈద్ మిలాఫ్.. మత సామరస్యానికి ప్రతీక అని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ శంభునిపేటలోని ఆర్ఆర్‌గార్డెన్‌లో ఫోర్ట్‌రోడ్డు హజ్రత్ జానుల్లా షహీద్ దర్గా, గ్రేవ్‌యార్డ్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ.ఖలీబ్ తన్వీర్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం కన్వీనర్ మహ్మద్ ముషైద్ తహశీర్ అధ్యక్షతన ఈద్ మిలాఫ్ కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ శాంతియుత సమాజ స్థాపన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం ముస్లిం మతపరమైన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మసూద్, అబ్జల్, బల్దియా అడిషనల్ కమిషనర్ రషీద్, ఉర్సు దర్గా పీఠాధిపతి సోయబ్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని ఎస్‌బీఐటీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ముత్యం రాజేందర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. బుధవారం ఉదయం 163 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు సుమారు 55-60 సంవత్సరాల వయసు కలిగి, చామన ఛాయ రంగు కోల మొహం, సన్నగా ఉన్నాడు. నలుపు, తెలుపు రంగు వెంట్రుకలు, బూడిద రంగు ఫుల్ షర్టు, నీలి రంగు గడులతో గోధుమ రంగు లుంగి ధరించి ఉన్నాడు. 5.2 ఫీట్ల పొడవు ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా మృతుడు గత కొంత కాలంగా ఒగ్లాపూర్ చుట్టుపక్క ప్రాంతాల్లో సంచరిస్తూ భిక్షాటన చేసుకునే వ్యక్తిగా స్థానికులు చెబుతున్నారు. ఇతని వివరాలు తెలిసినవారు దామెర పోలీస్ స్టేషన్‌కు లేదా 87126 85020 నంబర్‌కు సమాచారం అందివాల్సిందిగా ఎస్సై కోరారు. ఒగ్లాపూర్ వీఆర్ఏ రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'బీఆర్ఎస్ పార్టీకి అధికారులు దాసోహం'



ఫ్లెక్సీపై టమాటాలు విసురుతూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వరంగల్: అధికార పార్టీకి మున్సిపల్ అధికారులు బానిసలుగా మారి నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారని వరంగల్ తూర్పు బీజేపీ కన్వీనర్ కుసుమ సతీష్ అన్నారు. మున్సిపాలిటీ అధికారుల ధోరణికి నిరసనగా పోచమ్మమైదాన్ జంక్షన్‌లో వారి అలసత్వాన్ని ఫ్లెక్సీలో ముద్రించి టమాటాలతో కొట్టి బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో బీజేపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 24గంటలు కూడా ఉంచకుండా తీసివేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ బ్యానర్లు ఫ్లెక్సీలు, జెండాలను వారం రోజులుగా ఉంచుతున్నారని అన్నారు. బాకం హరిశంకర్, వన్నాల వెంకటరమణ, బైరి శ్యాంసుందర్, సముద్రాల పరమేశ్వర్, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకట్, రజనీష్ నేత, మురళీకృష్ణ, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై బీజేపీ నాయకులు బుధవారం కోడిగుడ్లు, టమాటాలు వేశారు. అనంతరం అధికారులు జోక్యం చేసుకుని ఫ్లెక్సీని తొలగించారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన



దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలో యాదవ సంఘం కుల పెద్దలు

మడికొండ: రేణుక ఎల్లమ్మ మహంకాళి బీరప్ప దేవుళ్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని 46వ డివిజన్ రాంపూర్‌లో అర్చకుడు సంతోష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు వేడుకలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం సామూహిక హోమాలు, సాయంత్ర ధాన్యదివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలదివాసం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, శుక్రవారం ఉదయం యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన, దృష్టికుంభం, బలిప్రదానం, పూర్ణాహుతి, పండిత సన్మానం, మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మాదరబోయిన సతీష్, బాషబోయిన కుమార్, తొట్టె ఆగయ్య, నాగరాజు, బండి పరశురాములు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

దామెర: మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన కూన మల్ల సురేందర్ (42) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వరంగల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు సురేందర్ కు బుధవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, ప్రధానకార్యదర్శి పెమాళ్ల దయాకర్, కోశాధికారి వెన్నం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కందికొండ శ్యామ్, సిరి సురేందర్, బిళ్ల రమేష్, రాంబాబు మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్ కుమార్, గుండ శ్రీను పాల్గొన్నారు.